
సంధిపూడిలో పోలింగ్ సమయం దాటినా క్యూలో నిల్చున్న ఓటర్లు


పి.గన్నవరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని పోలింగ్ బూత్ వద్దకు తీసుకువస్తున్న దృశ్యం


గంగలకుర్రులో ఓటు హక్కును వినియోగించుకుంటున్న శతాధిక వృద్ధ దంపతులు అప్పల నరసింహశాస్త్రి, పద్మావతి


ఆదుర్రులో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల పీఎస్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు


పొడగట్లపల్లిలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఊరుమే ఉత్సాహం

- ఓటు కోసం పోటెత్తిన జనం
- ప్రశాంతంగా పోలింగ్
- పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు
- పి.గన్నవరం, కొత్తపేట, రాజోలులో దాదాపుగా 80 శాతం పోలింగ్ నమోదు

పచ్చని కోనసీమ నియోజకవర్గాలైన కొత్తపేట, రాజోలు, పి.గన్నవరంల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. కొత్తగా ఓటు వచ్చిన యువత నుంచి శతాధిక వృద్ధుల వరకూ ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. కొన్ని చోట్ల రాత్రి 10 గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగి ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఉదయం 6.30 గంటలకే పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. అయితే పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో మాక్ పోలింగ్ కూడా ఆలస్యంగా జరిగింది. దీంతో గంటల తరబడి పోలింగ్ స్తంభించింది. మరమ్మతుల అనంతరం పోలింగ్ ప్రారంభమైంది. ప్రజలు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మలికిపురం మండలం చింతలమోరి గెద్దాడ వారి గ్రూపు బూత్‌లో వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలసి వినియోగించుకున్నారు. చెదురుమదురు సంఘటనలు తప్ప మండలం అంతటా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన స్వగ్రామం అయిన రావులపాలెం మండలం గోపాలపురంలోని 128 బూత్‌లో ఓటు వేసి ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ తిరిగి వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

పి.గన్నవరంలో ఘన విజయం సాధిస్తాం

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా భారీ మెజారిటీతో అధికారం చేపడతారని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. నియోజకవర్గ ఓటర్లకు, ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సోమవారం ఆయన పర్యటించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు. పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడి పలు సూచనలిచ్చారు. ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టించి పనిచేశారని అభినందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి రాజమహేంద్రవరంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్వాత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ ప్రమద్వర తెలిపారు. తొత్తరమూడి, శానపల్లిలంకలో చిన్నపాటి గొడవ తప్ప అన్ని చోట్ల ప్రశాంతంగా ఎన్నికలు జరిగినట్లు తెలిపారు. సాయంత్రం ఎనిమిది గంటల వరకూ ఓటర్లు ఓటు వేస్తూనే ఉన్నారు. ఈ సారి యువత ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. నడవలేని వృద్ధులు సైతం ఓటు హక్కును వినియోగంచుకోవడానికి వచ్చారు. అయినవిల్లి మండలంలో 84.08 శాతం పోలింగ్ పూర్తయిందని తహసీల్దార్ ప్రమద్వర తెలిపారు.

రాజోలు నియోజకవర్గంలో 72 శాతం పోలింగ్

రాజోలు: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని సోమవారం జరిగిన ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటలకు 73.01 శాతం ఓట్లు పోలయ్యాయి. 1,42,522 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే సుమారు 10 శాతం పైబడి ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అయితే శివకోడు 128 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుమారు 100 మంది పైబడి ఉండడంతో వారికి ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు వీలు కల్పించారు. వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కడలి గ్రామంలో 157వ పోలింగ్ బూత్‌లో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి యాలంగి రమేష్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక పోలింగ్

కొత్తపేట: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగింది. పలు పీఎస్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు నిరీక్షించాల్సి వచ్చింది. పలు చోట్ల ఓటర్లు నిర్ణీత సమయం లోపు చేరుకుని, సమయం ముగిసినా వారు ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు తన స్వగ్రామమైన వాడపాలెంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాంతో పలు పోలింగ్ స్టేషన్లలో 7.30 గంటల వరకూ కొనసాగింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో మొత్తం 2,52,383 మంది ఓటర్లు కాగా వారిలో స్త్రీలు 1,27,324 మంది, పురుషులు 1,25,053 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 262 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు.

బారులు తీరిన ఓటర్లు

ఉదయం 7 గంటలకే ఓటర్లు పీఎస్‌ల వద్దకు చేరుకుని ఓటు కోసం బారులు తీరారు. వేసవి ఎండలు తీవ్రతకు ముందే ఓటు వేసి వద్దామని మహిళలు సైతం పోలింగ్ భూత్‌లకు తరలివెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకూ బారులు తీరగా అప్పటి నుంచి మధ్యాహ్నం 2 గంటల పీఎస్‌ల వద్ద ఓటర్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది. మరలా 4 గంటల నుంచి మళ్లీ ఓటర్లు బారులు తీరారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 54 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరంలో ఈవీఎంలు మొరాయించడంతో గంట పాటు పోలింగ్ ఆలస్యమైంది. అలాగే గంగలకుర్రు, పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం, చినలంక, వక్కలంకలలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 6 గంటలకు ముగియాల్సి ఉండగా పుల్లేటికుర్రు, గంగలకుర్రు, వక్కలంక గ్రామాల్లో సుమారు ఒక్కో బూత్‌లో 200 మంది ఓటర్లు బారులు తీరారు. వీవీ ప్యాట్‌లు సక్రమంగా పనిచేయకపోవడం, ఎన్నికల సిబ్బంది అలసత్వం వల్ల పోలింగ్ నత్తనడకగా సాగిందని ఓటర్లు బహిరంగంగానే విమర్శించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మధ్యాహ్నం 11 గంటల నుంచి 4 గంటల వరకూ పోలింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి ఓటింగ్ శాతం పెరిగింది, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో డీఎస్పీలు 3, సీఐలు 9, ఎస్సైలు 17, ఏఎస్సైలు 39, సీఐఎస్ఎఫ్ 200, కానిస్టేబుల్స్, హోంగార్డులు 140 మంది ఎన్నికల విధులు నిర్వహించినట్లు పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో ఓటర్లు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వృద్ధులు సైతం యువకులతో పోటీ పడి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు

పి.గన్నవరం: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలు కట్టారు. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులు సైతం వచ్చి ఓటు వేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల లోపు బూత్‌ల వద్దకు వచ్చిన వారి ఓటు హక్కు వినియోగించుకునే కార్యక్రమం కొనసాగుతోంది. పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు రాజమహేంద్రవరం రూరల్‌లోను, జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఊడిమూడిలంకలోను ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: సార్వత్రిక ఎన్నికలు రావులపాలెం మండలం సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహాన్ని చూపారు. అయితే మధ్యాహ్నం సమయంలో ఎండ వేడికి జనం రద్దీ తగ్గడంతో సాయంత్రం సమయంలో పూర్తి స్థాయిలో జనం ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలి రావడంతో పోలింగ్ సమయం ముగిసే సమయానికి మండలంలోని గోపాలపురం, దేవరపల్లి, పొడగట్లపల్లి, వెదిరేశ్వరం, రావుడుపాడు గ్రామాల్లో రాత్రి 9:30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అనంతరం పోలింగ్ ముగిసినట్టు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ తెలిపారు.

రికార్డు స్థాయి పోలింగ్

ఆలమూరు: మండలంలో సోమవారం జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఏడాది రికార్డుస్థాయిలో 81.52 శాతం నమోదైంది. పోలింగ్ ప్రారంభించకముందే ఓటర్లు క్యూలో బారులు తీరారు. సంధిపూడి, జొన్నాడ, పెనికేరు, మూలస్థాన అగ్రహారం, కలచవర్ల గ్రామాల్లో రాత్రి 9.15 వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఓటింగ్ ముగిసే సమయానికి 81.52 శాతంగా నమోదైంది. మండలంలో గరిష్ఠంగా మోదుకూరులో 92.5 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని పలు గ్రామాల్లో 90 శాతం పైగా నమోదు కావడం చర్చనీయాంశమైంది.



రావులపాలెం మండలం గోపాలపురంలో ఓటు వేసిన అనంతరం సిరా మార్క్ చూపుతున్న జగ్గిరెడ్డి

రెండు కేంద్రాల్లో ఈవీఎంల మొరాయింపు

మామిడికుదురు: మండలంలోని 18 గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటు వేసేందుకు ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరారు. ఏ పోలింగ్ కేంద్రం వద్ద చూసినా ఓటర్ల క్యూలే కనిపించాయి. యువజన ఓటర్లు భారీగా తరలివచ్చి ఓట్లు వేశారు. లూటుకుర్రు, ఆదుర్రు గ్రామాల్లోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో రెండు చోట్ల అర గంట పోలింగ్‌కు ఆలస్యమైంది. పెదపట్నం లంక జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధులు ఓటు వేసేందుకు ఇబ్బంది పడుతున్నారని, అటువంటి వారికి హెల్పర్‌ను ఇవ్వాలని కూటమి వర్గం పట్టుబట్టింది. దీనికి పీఓ ససేమిరా అనడంతో స్వల్ప వాగ్వాదం జరిగింది. అధికారులు అక్కడికి చేరుకుని వివాదాన్ని చక్కదిద్దారు.

జగన్‌పై వీరాభిమానం..

పాశర్లపూడికి చెందిన డిగ్రీ విద్యార్థిని ఉంద్రు సాయి హనుమోలుసంజు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వీరాభిమాని, వైఎస్సార్ సీపీకి అంటే ఆమెకు ఎంతో ఇష్టం. ఆమెకు మొదటి సారిగా ఓటు వచ్చింది. ఆ ఆనందంలో వైఎస్సార్ సీపీ జెండా రంగులో డ్రెస్ కుట్టించుకుని, ఆ డ్రెస్ వేసుకుని ఓటు వేసి ఎంతో మురిసిపోయింది. వైఎస్సార్ సీపీ జెండా రంగులతో డ్రెస్ వేసుకుని జగన్‌పై తనకున్న అభిమానాన్ని సంజు చాటుకుంది.


చింతలమోరిలో ఓటు వేస్తున్న ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుతో భార్య, కుమారుడు


రాజమహేంద్రవరం రూరల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి


ముక్కామలలో తొలి ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు

క్లుప్తంగా

కుళాయి వాటర్‌లో చేప పిల్లలు


కుళాయి వాటర్ నుంచి వచ్చిన చేప పిల్లలు

మామిడికుదురు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏరియాలో సోమవారం తాగునీటి కుళాయి నుంచి చేప పిల్లలు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ వాటర్ నుంచి ఈ విధంగా చేప పిల్లలు రావడం ఏంటని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇటువంటి సమస్యలు ఏర్పడకుండా గ్రామ పంచాయతీతో పాటు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు తదితరులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వేంకటేశ్వర స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నిత్య హోమాలు, అర్చన, లక్ష్మీ హోమం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజలు జరిపారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు. కిమ్స్ ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు), ఎండీలు రవికిరణ్ వర్మ, శశికిరణ్ వర్మ దంపతులు కల్యాణం జరిపించారు. మంగళవారం ఉదయం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర కార్యక్రమాలు, స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

నూతన ఓటర్లు.. నూతనోత్తేజం

కొత్తపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులకు ఓటు హక్కు ప్రధానమైనది. ఎన్నికల కమిషన్ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించగా వారందరూ నూతన ఓటర్లుగా నమోదై ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు పొందారు. నూతనోత్సాహంతో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అటువంటి వారి ఓటు ఆనందం వారి మాటల్లోనే..

నూతనోత్సాహంతో తొలి ఓటు



ఈ ఎన్నికల్లో నాకు వచ్చిన ఓటు హక్కును తొలిసారిగా నూతనోత్సాహంతో వేశాను. చాలా ఆనందంగా ఉంది. ఇది చెప్పలేని అనుభూతి. ఓటర్లు ఎక్కువగా ఉన్నా క్యూలో నిలబడి మరీ ఓటు వేశాను.

– జగత అచ్యుత్‌నాయుడు, కొత్తపేట

చాలా ఆనందంగా ఉంది



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో పవిత్రమైనది, విలువైనది. ఈసారి ఆ ఓటు హక్కు వచ్చింది. ఎంతో ఆనందంగా ఉంది. తొలిసారిగా ఓటు వేసే అవకాశం రావడంతో హైదరాబాద్‌లో చదువుకుంటున్న నేను అక్కడి నుంచి వచ్చి మరీ ఓటు వేశాను.

– పోలిశెట్టి ప్రియలలిత, కొత్తపేట

నాకు తొలి ఓటు..



ఈ సార్వత్రిక ఎన్నికలకు 18 సంవత్సరాలు నిండిన వారికి ఎలక్షన్ కమిషన్ ఓటు హక్కు కల్పించింది. నాకు కల్పించిన ఆ ఓటు హక్కును తొలిసారిగా సద్వినియోగం వినియోగించుకున్నాను. నా తల్లిదండ్రులతో కలసి వెళ్లి ఓటు వేయడం చాలా ఆనందంగా ఉంది.

– రుద్ర లిఖితసత్యమాన్సి, కొత్తపేట

తొలిసారి ఓటు వేశా..



నేను తొలిసారి ఓటు వేశాను. నాకు ఓటు హక్కు రావడం చాలా ఆనందంగా ఉంది. ఓటును ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలి. అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని పాటించాలని ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను.

– షేక్ మహబూబ్‌వలీ, మార్కెట్ వీధి, కొత్తపేట

ఓపీఓ తీరుపై ఓటర్ల ఆగ్రహం

- ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించాడంటూ అభియోగం
- ఓపీఓను విధుల నుంచి తొలగించిన అధికారులు

రావులపాలెం: ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాల్సిన ఎన్నికల విధుల్లో ఉండే పోలింగ్ అధికారులు ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు. అధికారి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కేంద్రంలో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ హైస్కూల్లో 64వ బూత్‌లో ఓపీఓగా విధులు నిర్వహించేందుకు వచ్చిన మలికిపురం మండలానికి చెందిన సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జి.రాజీవ్ సోమవారం జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లకు సిరాను వేలుపై పెట్టేందుకు విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో టేబుల్ పై కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న ఒక ప్రముఖ పత్రికను (సాక్షి కాదు) కింద వేసుకుని సిర వేసే సమయంలో కూటమి పార్టీకి ఓటు వేయాలంటూ ఆ యాడ్‌ను చూపిస్తున్నాడని స్థానిక ఓటర్లు అభ్యంతర వ్యక్తం చేశారు. అతడితో వాగ్వాదానికి దిగడంతో కొంతసేపు ఆ కేంద్రంలో పోలింగ్ నిలిచిపోయింది. దీంతో రావులపాలెం తహసీల్దారు, పోలీస్ అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని ఓపీఓ రాజీవ్ అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలింగ్ తిరిగి కొనసాగింది. అయితే ఎన్నికల సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రావులపాలెం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మను వివరణ కోరగా గొడవ జరుగుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకుని విచారించామన్నారు. అయితే ఈనాడు పత్రికలో వచ్చిన కూటమి పార్టీకి చెందిన యాడ్ ఉన్న పేపర్ ను కింద వేసుకుని సిరాను పెట్టడంతో అతను ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించాడని స్థానికులు అభియోగించారన్నారు. దీంతో అక్కడ ఏ విధమైన గొడవలు జరగకుండా ఉండేలా పోలీస్ శాఖ వారు అతన్ని స్టేషన్‌కు తరలించారన్నారు. అయితే అతనిపై చర్యలు తీసుకునే అధికారం ఆ పోలింగ్ బూత్ పీఓకు ఉందని పీఓ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.


కూటమి యాడ్ ఉన్న ఈనాడు పేపరుతో పోలింగ్ కేంద్రంలో కూర్చోన్న ఓపీఓ రాజీవ్

వినాయకుని ఆలయానికి భక్తులు

అయినవిల్లి: స్థానిక అయినవిల్లి వినాయకుని ఆలయానికి భక్తులు వచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చి ఓటేసిన పలువురు అనంతరం స్వామిని దర్శించుకున్నారు. స్వామిని వివిధ పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అలాగే నూతనంగా నిర్మితమవుతున్న నల్లచెరువు ఇస్కాన్ టెంపుల్ ప్రాంగణాన్ని, అక్కడే ఉన్న అలిమేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సీఎం రంగసామికి పనసకాయల అందజేత


సీఎం రంగసామికి పనస కాయలను అందజేసిన ఎమ్మెల్యే కల్యాణసుందరం

యానాం: పుదుచ్చేరి రీజియన్ పరిధిలోని కాలపట్టు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యుడు కల్యాణ సుందరం సీఎం రంగసామికి సోమవారం పనసకాయలు అందజేశారు. కల్యాణసుందరం తన పొలంలో పనసతో పాటు అరటి, మామిడి తదితర ఉద్యానవన పంటలను పండిస్తున్నారు. అదేవిధంగా అందమైన మొక్కలు, పుష్పాలతో కూడిన గార్డెన్‌ను ఆయన తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఆయన తన పొలంలో పండిన పండ్లను మిత్రులకు, సహచర శాసనసభ్యులకు ఏటా పంపిస్తుంటారు. తాజాగా సీఎం రంగసామికి అందజేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని ప్రసిద్ధి గాంచిన ర్యాలి, వద్దిపర్రు, వాడపల్లి తదితర శివాలయాల్లో స్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఓటింగ్ అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చి ఓటర్లు ఆయా గ్రామాల్లో స్వాములను దర్శించుకుని, స్థానికంగా దొరికే స్వీట్లను కొనుగోలు చేశారు.

పరీక్షా ఫలితాల్లో నవోదయ విద్యాలయ రికార్డు

యానాం: 10వ, 12వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సోమవారం తెలిపారు. 10వ తరగతిలో యు.సుహితా ఏంజెల్ 98.40 శాతంతో ప్రథమ, ఎస్ఎస్‌వీ సాయిప్రణీత్ 94.50 శాతంతో ద్వితీయ, వి.త్రినయ్ సాయిచరణ్ 94.30 శాతంతో తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో కె.విశాలాక్షి భవ్య 91.80 శాతం, ఆదిత్య రంజన్‌నాగ్ 91 శాతం, పి.ప్రశాంత్‌కుమార్ 90.60 శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో పరీక్ష రాసిన 34 మంది విద్యార్థులందరూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. విద్యాలయ చరిత్రలోనే ఇది అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.